# పేదరికానికి కొత్త కొలమానం

మొదటిపేజీ తరువాయి...

అక్కసు వెళ్లగక్కారు. అప్పులు తెచ్చి ఆస్తులు సృష్టించామని గత ప్రభుత్వం చెప్పిందని.. మిషన్ భగీరథ, కాళేశ్వరంతో ఏమైనా ఆస్తి సృష్టించారా? అని ప్రశ్నించారు. 'అప్పు తెచ్చినప్పుడు దానిని పెట్టుబడిగా పెట్టి.. ఆదాయం వచ్చినప్పుడు అప్పు కట్టాలి. మిషన్ భగీరథకు రూ.50 వేల కోట్లు అప్పు తీసుకొచ్చారు. లక్ష కోట్లు అప్పు తీసుకొచ్చి కాళేశ్వరం కట్టారు. ఒక్క రూపాయి అయినా ఆదాయం సృష్టించి.. వచ్చిన ఆదాయంతో అప్పు కట్టారా?' అంటూ వ్యాఖ్యానించారు. మేడిగడ్డ కుంగిందని.. అన్నారం పగిలిపోయిందని చెప్పారు. 'నీళ్ల ముసుగులో నిధుల దోపిడీ జరిగింది. లక్ష కోట్లు ఖర్చుపెట్టినా.. కాళేశ్వరం కూలిపోకపోయి ఉంటే.. వారు చేసిన తప్పిదాలపై చర్చ కొంత తక్కువ జరిగి ఉండేది. ఇవ్వాళ మేడిగడ్డ కుంగిపోయింది.. అన్నారం పగిలిపోయిందని చెప్తుంటే.. మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తి అన్నారంలో పోయమంటున్నారు. వితండ వాదనతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు' అంటూ విమర్శలు గుప్పించారు. ప్రాజెక్టుల ద్వారా ఆదాయం వస్తుందని బ్యాంకులకు చెప్పి, ప్రభుత్వానికి వచ్చే నికర ఆదాయాన్ని అప్పుల కింద కట్టే పరిస్థితి కల్పించారని మండిపడ్డారు. అందుకే ఆర్థిక సంక్షోభం వచ్చిందని పేర్కొన్నారు. 2014లో రూ.72 వేల కోట్ల అప్పులు ఉండగా.. అవి నేడు రూ.7 లక్షల కోట్లకు చేరాయని తెలిపారు. నాడు అప్పు కింద ఏటా రూ. 6 వేల కోట్లు మాత్రమే చెల్లిస్తే.. నేడు రాష్ట్రానికి ఏటా రూ.1.30 లక్షల కోట్ల ఆదాయం వస్తుండగా.. అప్పు కింద రూ.70 వేల కోట్లు చెల్లించాల్సి వస్తున్నదని అన్నారు. కాళేశ్వరం జలాలతో పెరిగిన భూగర్భజలం, వాటి ఫలితంగా పెరిగిన పంట విస్తీర్ణం, గణనీయంగా పెరిగిన దిగుబడి, తద్వారా రైతులకు పెరిగిన ఆదాయం వంటి అంశాలను సీఎం విస్మరించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయ విస్తీర్ణం పెరిగింది కదా? అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. రాష్ట్రం వచ్చినప్పుడు 18 లక్షల పంపుసెట్లు మాత్రమే ఉండేవని, ఇప్పుడు 29 లక్షలకు పెరిగాయని అన్నారు. అదనంగా వచ్చిన 11 లక్షల పంపుసెట్ల కింద సుమారు 40 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగు పెరిగిందని, అందుకే ఉత్పత్తులు కూడా పెరిగాయని వివరించారు. అంతే తప్ప గత ప్రభుత్వం చేసిందేమీ లేదని అన్నారు. సాగు నీటి ప్రాజెక్టులతో భూగర్భ జలాలు పెరిగాయని, నాణ్యమైన ఉచిత విద్యుత్తు వల్లే రైతులు సాగు విస్తీర్ణం పెరిగిందని, పంపుసెట్ల వినియోగం పెరిగిందంటూ పలువురు నిపుణులు పేర్కొన్న విషయాన్ని మాత్రం సీఎం అంగీకరించలేదు.

# చెంతనే తుంగభద్ర.. తీరని దాహం!

- రాజాపురంలో తీవ్ర నీటి ఎద్దడి
- కృష్ణలో నీళ్లులేక 'భగీరథ' నీళ్లు బంద్
- రంగనాథస్వామి ఉత్సవాలకు బంధువులనూ పిలవని గ్రామస్థులు
- ప్రస్తుతం 4 ట్యాంకర్లతో నీటి సరఫరా

అయిజ, ఫిబ్రవరి 26: కూత వేటు దూరంలోనే తుంగభద్ర నది. మిషన్ భగీరథ పథకం కింద మూడు నెలల క్రితం వరకు పుష్కలంగా నీటి సరఫరా. అంతలోనే పరిస్థితులు ఒక్కసారిగా తారుమారయ్యాయి. వర్షాలు ఆశించినమేర లేకపోవడం, ఫిబ్రవరి నుంచే భానుడు భగభగలాడుతుండడంతో నీటి మట్టం క్రమేపీ తగ్గుతూ వస్తున్నది. ఫలితంగా వేసవికి ముందే జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని రాజాపురం దాహార్తితో అల్లాడుతున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పథకం కింద ఇంటిఇంటికీ నల్లాల ద్వారా పుష్కలంగా వచ్చే నీరు ఇప్పుడు ముఖం చాటేయడంతో గొంతు తడుపుకొనేందుకు గ్రామస్థులు పడరాని పాట్లు పడుతున్నారు.



జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం రాజాపురంలో ట్యాంకర్ల వద్ద క్యూలో ఉంచిన బిందెలు, నీటి కోసం మహిళల బారులు

### నాలుగు ట్యాంకర్లతో నీటి సరఫరా

రాజాపురంలో 540 నివాస గృహాలు ఉండగా 2,400 మంది నివసిస్తున్నారు. ఒక్కోటీ 60 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న రెండు (1.2 లక్షల లీటర్లు) ట్యాంకులు ఉన్నాయి. నీటి సరఫరా కోసం 530 మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఉన్నాయి. గ్రామానికి సరిపడా నీటిని సరఫరా చేయాలంటే జూరాల పంప్ హౌస్ నుంచి నీరు అందాలి. కానీ, కృష్ణానదిలో నీటి మట్టం గణనీయంగా పడిపోవడంతో తాగునీటికి కష్టాలు మొదలయ్యాయి. గ్రామంలో చేతి పంపులు, బోర్లు లేకపోవడంతో నీటికోసం జనం తండ్లాడుతున్నారు. ప్రస్తుతానికి నాలుగు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామానికి సమీపంలోనే తుంగభద్ర నది పారుతున్నప్పటికీ మిషన్ భగీరథ నీటి సరఫరాను పెంచడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి ఎద్దడికి గత సర్పంచ్ నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. గ్రామంలో ప్రస్తుతం గుంటి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాలకు బంధువులను ఆహ్వానిద్దామంటే నీటి కొరత వేధిస్తుండడంతో వెనక్కి జంకుతున్నారు.

### నీటి కోసం కొట్లాట

గ్రామానికి నీటిని అందించేందుకు మూడు కిలో మీటర్ల దూరంలోని వ్యవసాయ బోరును అధికారులు లీజుకు తీసుకున్నారు. నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని పంచాయతీ ట్యాంకర్‌తో పాటు సమీపంలోని పులికల్, బైనపల్లి, కొత్తపల్లి గ్రామాల ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్ వచ్చిన సమయంలో నీటి కోసం జనం కొట్టుకుంటున్నారు. క్యూలో బిందెలు ఉంచి వంతు కోసం ఎదురుచూస్తున్నారు. ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తుండడంతో ట్యాంకర్ల వద్ద ప్రజలు బిందెలు పట్టుకుని పరుగులు పెట్టాల్సి వస్తున్నదని, క్యూలో గంటల తరబడి నిలబడాల్సి వస్తున్నదని గ్రామస్థులు వాపోతున్నారు.

### నీళ్లే లేవు.. జాతరెట్ల చేసుకోవాలె



ఎండాకాలం రానేలేదు. నీళ్లు లేకపాయె. కేసీఆర్ సార్ ఉన్నప్పుడు మిషన్ భగీరథ నీళ్లు ఇంటింటికీ నల్లాల ద్వారా ఇచ్చెటోడు. ఇప్పుడేమో మా ఊరికి తాగనికె నీళ్లొస్తలేవు. బోర్లు లేవు. చేతి పంపులు లేవు. నీళ్లెట్ల తెచ్చుకోవాలె. ట్యాంకర్లు లేకపోతే సేన్లకెళ్లి తెచ్చుకోవాలె. సేన్ల రైతులు రానీయకపోతే ఎట్ల? నీళ్లు లేక జాతరకు చుట్టాలను పిలువకపోతిమి. సర్కారు దయదల్చి మా ఊరికి మిషన్ భగీరథ నీళ్లు ఇయ్యాలె.

**–హనుమంతమ్మ, రాజాపురం, అయిజ మండలం, జోగులాంబ గద్వాల జిల్లా**

### తుంగభద్ర ఉన్నా నీళ్లు లేకపాయె



తుంగభద్ర నది పక్కనే ఉన్నా నీళ్లు లేకపాయె. మిషన్ భగరీథ నల్లాలు ఉన్నా నీళ్లు రాక ఒట్టిపోయాయి. పనులకు పోకుండా ట్యాంకర్ల నీళ్ల కోసం గంటల తరబడి చూడాల్సి వస్తున్నది. పనులకు వెళ్లకుండా నీళ్లకే పొద్దంతా పోతుంది. మా ఊరికి తాగేందుకు నీళ్లిచ్చి కష్టాలు తొలగించాలి.

**– పద్మమ్మ, రాజాపురం, అయిజ మండలం, జోగులాంబ గద్వాల జిల్లా**

### శాశ్వత పరిష్కారానికి చర్యలు



**రాజాపురానికి** మిషన్ భగీరథ నీరు అంతంత మాత్రం వస్తున్న విషయం అధికారులతో చర్చించాను. 1.2 లక్షల లీటర్లు రావాల్సి ఉండగా 40 వేల లీటర్ల వరకు అందుతున్నాయి. తక్కువ సమయంలోనే ట్యాంక్‌లు ఖాళీ అవుతున్నాయి. ప్రస్తుతానికి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం. ఉన్నతాధికారులతో చర్చించి, అదనంగా మిషన్ భగీరథ పైప్‌లైన్ వేయించి తాగునీటి ఎద్దడి తీర్చేందుకు చర్యలు తీసుకుంటాం.

**– వెంకటయ్య, ఎంపీడీవో, అయిజ మండలం, జోగులాంబ గద్వాల జిల్లా**



ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని బొజ్జు కొలాంగూడకు దూరంగా ఉన్న ఒర్రె నుంచి నీటిని తోడుకుంటున్న గిరిజనులు

# గిరిజనుల తాగునీటి తంటాలు

## ఆదిలాబాద్ జిల్లాలో ఒర్రె నీరే దిక్కు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 26(నమస్తే తెలంగాణ): ఎండాకాలం ప్రారంభానికి ముందే ఆదిలాబాద్ జిల్లాలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. నార్నూర్ మండలంలోని బొజ్జు కొలాంగూడలో కొన్ని రోజులుగా స్థానికులు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. పంట పొలాల మధ్యలో నుంచి కిలోమీటరుకు పైగా నడుచుకుంటూ వెళ్లి ఒర్రె నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ఈ ఆదివాసీ గూడలో ఉట్నూర్ ఐటీడీఏ బోరు వేయించినా.. కరెంటు సరఫరా లేక తాగు నీటి సమస్య తీరడం లేదు. కలుషిత జలాలు తాగడం వల్ల అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని, తమ సమయమంతా నీరు తెచ్చుకోవడానికే సరిపోతున్నదని, వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులను ఎన్నిసార్లు కోరినా ఫలితం లేదని వాపోతున్నారు.

## లోకం పోకడ




డ్రైవర్ని అనికూడా చూడకుండా నా సీట్లో కూర్చొని లేవనంటే ఎట్లమ్మా?!

## నిరంతర విద్యుత్తు సరఫరాకు సహకరించాలి: టీఎస్‌పీఈఏ

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రజలకు నిరంతర విద్యుత్తును సరఫరా చేసేందుకు పూర్తి సహకారం అందించాలని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీఈఏ) విద్యుత్తు ఇంజినీర్లను కోరింది. గృహజ్యోతి పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు పాటుపడాలని టీఎస్‌పీఈఏ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు పీ రత్నాకర్‌రావు, పీ సదానందం సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి సహా పార్లమెంట్ ఎన్నికలు, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సేవలు అందించాలని పిలుపునిచ్చారు.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 18.8°c | 35.7°c |
| మెదక్ | 20.0°c | 35.5°c |
| ఖమ్మం | 20.0°c | 35.0°c |
| ఆదిలాబాద్ | 20.6°c | 34.5°c |
| నిజామాబాద్ | 20.3°c | 34.4°c |
| హైదరాబాద్ | 20.9°c | 30.9°c |
| కరీంనగర్ | 21.0°c | 32.0°c |
| వరంగల్ | 21.0°c | 32.0°c |
| మహబూబ్‌నగర్ | 21.7°c | 34.9°c |
| నల్లగొండ | 24.0°c | 35.5°c |



# నాడు 'ఫ్రీ' అన్నారు.. నేడు ఫీజు అడిగారు!

మొదటిపేజీ తరువాయి...

మాటలను అటకెక్కించేశారు. ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పావులు కదుపుతున్నది. ఎల్ఆర్ఎస్ ద్వారా పేదలపై భారం మోపేందుకు రంగం సిద్ధం చేసింది. ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసిన 25 లక్షల మంది నుంచి మార్చిలోగా రూ. 20 వేల కోట్లకుపైగా వసూలు చేసేందుకు ప్రణాళికలు రచించింది. ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్యతరగతి వారిపై కనీసం లక్ష రూపాయల భారం పడనుంది.

### ఎల్ఆర్ఎస్‌ను వేగవంతం చేయండి: రేవంత్

లక్షలాదిమంది దిగువ, మధ్యతరగతి కుటుంబాలకు మేలు చేసే ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం అధికారులకు ఆదేశాలు జారీచేశారు.31 ఆగస్టు 2020 నుంచి అక్టోబర్ 31 వరకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు నెలలపాటు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు స్వీకరించింది. రాష్ట్రవ్యాప్తంగా 25.44 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఓపెన్ ప్లాట్లు, నాన్ లేఅవుట్‌కు సంబంధించిన దరఖాస్తుదారులు రూ. 1000 ఫీజు చెల్లించి డాక్యుమెంట్ కాపీని సమర్పించారు. పెద్ద లేఅవుట్ స్థలాలకు రూ. 10 వేలు చెల్లించారు. ఆ ప్రక్రియ అంతటితో నిలిచిపోయింది. కోర్టు కేసుల కారణంగా ఈ ప్రక్రియ ఆలస్యమైనట్టు రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు సోమవారం సచివాలయంలో సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం లక్షలాది కుటుంబాలకు మేలుచేసే ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.అప్పటి నిబంధనల ప్రకారమే లే అవుట్ క్రమబద్ధీకరణ చేపట్టాలని సూచించారు. దరఖాస్తుదారులు పూర్తి రుసుము చెల్లించి మార్చి 31 లోగా లే అవుట్ క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములు తప్ప ఇతర లేఅవుట్‌లను క్రమబద్ధీకరించాలని ఆదేశాలు జారీచేశారు.

**ఎల్ఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తులు**

| స్థానిక సంస్థలు | దరఖాస్తుల సంఖ్య | అడ్వాన్స్‌గా చెల్లించిన మొత్తం (రూ.లక్షల్లో) | స్థలం (చదరపు గజాలు) |
|---|---|---|---|
| మున్సిపల్ కార్పొరేషన్లు | 4,13,519 | 4,260 | 1,604 |
| గ్రామ పంచాయతీలు | 10,76,487 | 11,341 | 5,330 |
| మున్సిపాలిటీలు | 10,54,420 | 10,993 | 3,739 |
| మొత్తం | 25,44,426 | 26,594 | 10,673 |

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- మిర్చికి తెగుళ్లు సోకి, పత్తి దిగుబడి రాక ఆందోళన
- 7 లక్షల అప్పు తీర్చలేక శ్రీనివాస్ పురుగుల మందు తాగి బలవన్మరణం
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా దంతాలపల్లిలో విషాదం

కాటారం, ఫిబ్రవరి 26: అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి మరో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దంతాలపల్లికి చెందిన రైతు సింగిరెడ్డి శ్రీనివాస్ ఆత్మహత్య ప్రతి ఒక్కరినీ కలచివేసింది. కాటారం ఎస్సై అభినవ్, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్(48)కు భార్య రజిత, ఇద్దరు కుమారులు అజయ్, అక్షయ్ ఉన్నారు. వీరు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుండగా, ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నారు. శ్రీనివాస్ ఈ ఏడాది మూడెకరాల తన సొంత భూమితో పాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి పంట సాగు చేశాడు. రెండున్నర ఎకరాల్లో సుమారు రూ.4.50 లక్షల పెట్టుబడితో మిర్చి పంట, మరో మూడున్నర ఎకరాల్లో సుమారు రూ.2.50 లక్షల పెట్టుబడితో పత్తి సాగు చేశాడు. తెగుళ్లు సోకి మిర్చి పంట నాశనమైంది. వాతావరణ ప్రతికూల పరిస్థితులతో పత్తి పంట దిగుబడి రాలేదు. దీంతో సుమారు రూ.7 లక్షల మేర అప్పుల పాలయ్యాడు. దీనికి తోడు చిన్న కుమారుడు అక్షయ్ చదువు కోసం రూ.లక్షా 30 వేల ఫీజు చెల్లించాల్సి ఉన్నది. చేసిన అప్పు తీర్చలేనని తీవ్ర మనోవేదనకు గురైన శ్రీనివాస్ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో మహదేవపూర్‌కు తీసుకెళ్తుండగా దారిలోనే మృతిచెందాడు.

# సచివాలయంలో సీఎం రాజకీయ విమర్శలు

- అధికారిక కార్యక్రమంలో ప్రతిపక్షంపై దాడి
- దుమ్మెత్తిపోసేందుకే ప్రాధాన్యం
- రేవంత్ తీరుపై పరిశీలకుల విస్మయం
- సింగరేణి కార్మికులకు కోటి బీమా
- యూనియన్ బ్యాంక్‌తో సంస్థ ఒప్పందం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తాను మాట్లాడుతున్నది రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయంలో నన్నది మరిచిపోయి.. పీసీసీ అధ్యక్షుడిగా గాంధీ భవన్‌లో మాట్లాడుతున్నాననుకొని ఫక్తు రాజకీయ విమర్శలు, వ్యాఖ్యలు చేస్తున్నారు. సచివాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడిన తీరే ఇందుకు నిదర్శనమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. సింగరేణి సంస్థ, బ్యాంకులకు మధ్య జరిగిన ఒప్పందం నేపథ్యంలో సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి అసలు విషయాన్ని పక్కన పెట్టి పాత ప్రభుత్వంపై, ప్రతిపక్ష పార్టీలపై దుమ్మెత్తిపోయడానికి ప్రాధాన్యమిచ్చారు. అధికారంలో ఉన్నవారు సచివాలయంలో ప్రభుత్వాధినేతగా.. పార్టీ కార్యాలయంలో పార్టీ అధినేతగా వ్యవహరించాలి. ఇవన్నీ మర్చిపోయిన రేవంత్‌రెడ్డి కేవలం రాజకీయ విమర్శలు, గత ప్రభుత్వంపై తన అక్కసును వెళ్లగక్కడానికే సమావేశాన్ని ఉపయోగించుకున్నారు.

### బీఆర్ఎస్‌పై విమర్శలు

బీఆర్ఎస్‌లో ప్రస్తుతం తండ్రీ కొడుకులు, మామా అల్లుండ్లు తప్ప.. ఎవరూ వారితో ఏకీభవించలేదంటూ సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ విమర్శలకు దిగారు. శాసనమండలిలో కల్వకుంట్ల కవిత, శాసనసభలో హరీశ్‌రావు లేదా కేటీఆర్, బహిరంగ సభల్లో కేసీఆర్.. ఈ నల్గురు తప్పితే వేరేవారు ఎవరైనా ఆమోదిస్తున్నారా అంటూ వ్యాఖ్యానించారు. తాము 70 రోజుల్లో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు. తాము నియామక పత్రాలు ఇస్తుంటే.. వారి హయాంలోనే నోటిఫికేషన్లు, పరీక్షలు నిర్వహించామంటూ విమర్శలు చేస్తున్నారని, 'ఇన్ని చేసినోళ్లు.. అదికూడా మీరే చేసి ఉండవచ్చుకదా' అని విమర్శించారు. తెలంగాణను ఇచ్చింది, తెలంగాణను కాపాడేది, అభివృద్ధి పథం వైపు నడిపించేది, సంక్షేమ పథకాలను అమలు చేసేది కాంగ్రెస్ పార్టీ.. అంటూ ఫక్తు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

### సింగరేణి ఒప్పందం..

సింగరేణి కార్మికులకు రూ. కోటి ప్రమాద బీమాకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి సమక్షంలో సింగరేణి సంస్థ సీఎండీ బలరామ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీజీఎం భాస్కర్‌రావు ఒక ఒప్పందంపై సంతకాలు చేసి పత్రాలు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా, ఉత్తమ్, పొంగులేటి, శ్రీధర్ బాబు, సీతక్క, తుమ్మల, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కార్మిక లోకానికి చరిత్రాత్మకమైన రోజు: భట్టి

సింగరేణిలో రూ. కోటి ప్రమాద బీమా పథకం సంస్థలోని 43 వేల మందికి వర్తిస్తుందని, ఇది చరిత్రాత్మకమైన రోజని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రూ. కోటి ప్రమాద బీమా అమలు చేస్తున్న ప్రభుత్వం తమదేనని అన్నారు. సింగరేణి కార్మికులను కాపాడుకోవాలని ప్రభుత్వం రూ.కోటి ప్రమాద భీమా తీసుకొచ్చినట్టు వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సింగరేణిలో పనిచేసే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు రూ. 25 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు ప్రమాద బీమా పథకాన్ని ప్రారంభించామని తెలిపారు.

## నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

### సెయిల్‌లో 314 పోస్టులు..

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం పోస్టులు: 314
- పోస్టులు: ఆపరేటర్ కమ్ టెక్నీషియన్ (ట్రెయినీ)
- విభాగాలు: మెటలర్జీ, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, క్లినికల్, ఇనుస్ట్రుమెంటేషన్ తదితరాలు
- ఎంపిక: రాత పరీక్ష ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరి తేదీ: మార్చి 18
- వెబ్‌సైట్: https://www.sail.co.in

### కమ్యూనిటీ ఎడ్యుకేటర్లు

హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖలో తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 66
- పోస్టులు: కమ్యూనిటీ ఎడ్యుకేటర్ కమ్ మాస్టర్ వాలంటీర్
- అర్హతలు: డిగ్రీలో సైకాలజీ లేదా సోషల్ వర్క్ లేదా పబ్లిక్ హెల్త్, సైకియాట్రిక్ ఉత్తీర్ణత, పీజీడీసీఏ సర్టిఫికెట్ ఉండాలి
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో చూసుకోగలరు
- వెబ్‌సైట్: https:wdsc.telangana.gov.in

### రామగుండం ఫర్టిలైజర్స్‌లో..

రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్‌లో రెగ్యులర్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 27
- పోస్టులు: అసిస్టెంట్ మేనేజర్, సీనియర్ మేనేజర్, మేనేజర్, సీనియర్ మెడికల్ ఆఫీసర్
- విభాగాలు: కెమికల్, మెకానికల్, హెచ్ఆర్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరి తేదీ: మార్చి 20
- వెబ్‌సైట్: https://www.rfcl.co.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- పాలిటీ, జాగ్రఫీ (గ్రూప్స్) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

# నెలకో పోస్టింగ్!

## ఏ పోస్టింగ్‌లో ఎన్ని రోజులో తెలియనిస్థితిలో పోలీసు అధికారులు

స్థాయి, హోదా కూడా తీసికట్టు • బదిలీ పేరుతో సర్కార్ చెడుగుడు

రాచకొండ సీపీగా సుధీర్‌బాబు.. నెలన్నరకే ఆయన స్థానంలో తరుణ్‌జోషి



*హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకు, చేతలకు అస్సలు పొంతన కుదరడం లేదు. ఈ విషయాన్ని సర్కారు పలుమార్లు బాహాటంగా బయటపెట్టుకున్నది. తమ ప్రభుత్వంలో అవకతవకలకు ఆస్కారం లేదంటూనే పైరవీలకు తలుపులు బార్లా తెరిచింది. సీనియారిటీకి అనుగుణంగా చిత్తశుద్ధితో పనిచేసిన అధికారులకు పోస్టింగ్‌లు ఇస్తామని సందర్భం వచ్చిన ప్రతిసారీ ప్రభుత్వం పదేపదే చెప్తూనే ఉన్నది. ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. పోలీసు శాఖలో అయితే స్థాయి, హోదా, సీనియారిటీ వంటి మరే ఇతర అంశాలకు ప్రభుత్వం పూచిక పుల్లంత విలువ కూడా ఇవ్వడం లేదని బదిలీలు తేటతెల్లం చేస్తున్నాయి. పదోన్నతుల వల్ల పోస్టింగ్, సర్దుబాట్ల వరకు ఓకే కానీ, అభిమానులుగా నిరూపించుకోగలిగితే మాత్రం బదిలీలకు కొదవ ఉండదని ప్రభుత్వ చర్యలు స్పష్టం చేస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసు సీనియర్ల బదిలీలు నెలకో పోస్టింగ్ అన్న చందంగా తయారైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సీనియర్ ఐపీఎస్ అధికారి జీ సుధీర్ బాబు అడిషనల్ సీపీ (హైదరాబాద్) ట్రాఫిక్ నుంచి రాచకొండ సీపీగా బదిలీ అయ్యారు. నెలన్నర కూడా గడవక ముందే ఆయన స్థానంలో తరుణ్‌జోషిని ప్రభుత్వం నియమించింది.*

### *ఎన్ని రోజులుంటారో?*

*వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్‌ను ప్రభుత్వం అడిషనల్ సీపీ క్రైమ్స్ అండ్ సిట్‌గా బదిలీ చేసింది. తాజాగా ఆయనను అక్కడి నుంచి మల్టీ జోన్-1 ఐజీగా బదిలీ చేసింది. పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న జీ సుధీర్‌బాబును మల్టీ జోన్-1 ఐజీ స్థానం నుంచి రిలీవ్ చేసింది. పోలీసుశాఖలో ఏ విభాగంలో, ఏ స్థానంలో ఏ అధికారి ఎన్ని నెలలు, రోజులు ఉంటారో తెలియని అయోమయం నెలకొన్నది. సీనియర్ ఐపీఎస్, జూనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీలే ఇంత గందరగోళంగా ఉంటే ఇక డీఎస్పీ/అడిషనల్ ఎస్పీస్థాయి అధికారుల బదిలీలు ఇంకెలా ఉంటాయోనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఎప్పుడూ ఇలా లేదని, ఈ సర్కారు మాత్రం తమతో చెడుగుడు ఆడుకుంటున్నదని పోలీసు వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.*

### *మల్టీజోన్ ఐజీగా రంగనాథ్*

*రాష్ట్రంలో ముగ్గురు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అడిషనల్ పీసీ (క్రైమ్స్), సిట్ ఇన్‌చార్జీగా బాధ్యతలు నిర్వహిర్తిస్తున్న ఏవీ రంగనాథ్‌ను మల్టీ జోన్-1 ఐజీగా, ట్రాఫిక్ అడిషనల్ సీపీగా విధులు నిర్వహిస్తున్న విశ్వప్రసాద్‌ను ఆర్గనైజేషన్ ఐజీగా, హైదరాబాద్ సిటీ సెంట్రల్ జోన్ డీసీపీగా పనిచేస్తున్న శరత్‌చంద్ర పవార్‌ను స్టేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు.*

### *సందీప్ శాండిల్యకు డీజీగా పదోన్నతి*

*సీనియర్ పోలీసు అధికారి, 1993 ఐపీఎస్ అధికారి సందీప్ శాండిల్యకు డీజీపీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.*